# పై నుండి సహాయము



ఉచితము–అమ్మబడదు

# పై నుండి సహాయము

దేవుని వాక్యము పై నుండి వచ్చును. అది నీతి యెడల ఆకలిదప్పులు గల వారికెంతయో ప్రయోజనకరముగా నుండును. ఒక వ్యక్తి తన సంపూర్ణ హృదయముతో పశ్చాత్తాపము నొంది, తన పాపములను విడచి, రక్షకుడును, ప్రభువైన యేసునందు, విశ్వాసముంచిన, ప్రభువు తన్నుతాను ప్రత్యక్ష పరచుకొని, తన సంతోషమును సమాధానమును అతనికనుగ్రహించును. ఈ దివ్యానుభవమును నేను 1937 సం॥లో పొందినప్పటినుండి, ఇప్పటి వరకు నేను రక్షకునితో, ఎడతెగని సహవాసమును కలిగియున్నాను. నీవు ప్రభువైన యేసును నీ రక్షకునిగా అంగీకరించనిచో, యిప్పుడే ఆయన యందు విశ్వాసముంచి, నిన్ను నీవు సమర్పించుకొనుమని బ్రతిమాలుచున్నాను.

వాట్ సన్ గుడ్ మన్

All scriptures are taken from the Telugu Bible with permission from the Bible Society of India.

# దేవుని ప్రేమ



ప్రకటన 1:5

నమ్మకమైన సాక్షియు, మృతులలో నుండి ఆది సంభూతుడుగా లేచినవాడును, భూపతులకు అధిపతియునైన యేసుక్రీస్తు నుండియు, కృపాసమాధానములు మీకు కలుగును గాక.



యోహాను 3:16

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.

రోమా 5:8

అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను.

# యేసుక్రీస్తు దైవత్వము

## మత్తయి 1:22,23

ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును. ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము.

## 1 తిమోతికి 3:16

నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నది; ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పునొందెను. దేవదూతలకు కనబడెను. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను. లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను.

# యేసుక్రీస్తు దేవుని కుమారుడు



యెషయా 9:6

ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్యభారముండును; ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును.

1యోహాను 4:15

యేసు దేవుని కుమారుడని యెవడు ఒప్పుకొనునో, వానిలో దేవుడు నిలిచియున్నాడు, వాడు దేవునియందున్నాడు.

కొలొస్సయులకు 2:9

ఏలయనగా దేవత్వముయొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందు నివసించుచున్నది.

# యేసు తన్నుగూర్చి చెప్పెను

యోహాను 6:35

అందుకు యేసు వారితో ఇట్లనెను – జీవాహారము నేనే; నాయొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు, నాయందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు.

యోహాను 11:25

అందుకు యేసు – పునరుత్థానమును జీవమును నేనే నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును.

యోహాను 8:58

యేసు – అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను.

యోహాను 10:7

కాబట్టి యేసు మరల వారితో ఇట్లనెను – గొర్రెలు పోవు ద్వారమును నేనే;

# యేసు చేసిన కొన్ని అద్భుతములు



లూకా 5:4-6

ఆయన బోధించుట చాలించిన తరువాత – నీవు దోనెను లోతునకు నడిపించి, చేపలు పట్టుటకు మీ వలలు వేయుడని సీమోనుతో చెప్పగా సీమోను – ఏలిన వాడా, రాత్రి అంతయు మేము ప్రయాసపడితిమి గాని మా కేమియు దొరకలేదు. అయినను నీ మాట చొప్పున వలలు వేతునని ఆయనతో చెప్పెను. వారాలాగు చేసి విస్తారమైన చేపలు పట్టిరి, అందుచేత వారి వలలు పిగిలి పోయెను.

మత్తయి 20:30,34

ఇదిగో త్రోవ ప్రక్కను కూర్చున్న యిద్దరు గ్రుడ్డివారు యేసు ఆ మార్గమున వెళ్లుచున్నాడని విని – ప్రభువా, దావీదు కుమారుడా, మమ్ము కరుణింపుమని కేకలు వేసిరి... కాబట్టి యేసు కనికరపడి వారి కన్నులు ముట్టెను, వెంటనే వారు దృష్టిపొంది ఆయన వెంట వెళ్లిరి.

# యేసుక్రీస్తు సృష్టికర్త - యేసుక్రీస్తు ప్రభువు

అపొస్తలుల కార్యములు 2:36

మీరు సిలువవేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను.

యోహాను 1:3

సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు.

కొలొస్సయులకు 1:16

ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను, ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను.

# యేసుక్రీస్తు అందరికి న్యాయాధిపతి



అపొస్తలుల కార్యములు 10:42

ఇదియుగాక దేవుడు సజీవులకును మృతులకును న్యాయాధిపతినిగా నియమించిన వాడు ఈయనే అని ప్రజలకు ప్రకటించి దృఢసాక్ష్యమియ్యవలెనని మాకు ఆజ్ఞాపించెను.

యోహాను 5:22

తండ్రి యెవనికిని తీర్పు తీర్చడుగాని తండ్రిని ఘనపరచునట్లుగా అందరును కుమారుని ఘనపరచవలెనని తీర్పుతీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించియున్నాడు.

రోమా 14:10

అయితే నీవు నీ సహోదరునికి తీర్పు తీర్చనేల? నీ సహోదరుని నిరాకరింపనేల? మనమందరము దేవుని న్యాయపీఠము యెదుట నిలుతుము.

# క్రీస్తు ద్వారానే విమోచన

యోహాను 14:6

యేసు – నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు.

అపొస్తలుల కార్యములు 4:12

మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము.

హెబ్రీయులకు 7:25

ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడై యున్నాడు.

# క్రీస్తు ద్వారానే విమోచన

కొలొస్సయులకు 1:12-14

ఆయన మహిమ శక్తినిబట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలెననియు, తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగుటకు మనలను పాత్రులనుగా చేసిన తండ్రికి మీరు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెననియు దేవుని బతిమాలుచున్నాము. ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను. ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది.

తీతుకు 2:14

ఆయన సమస్తమైన దుర్నీతి నుండి మనలను విమోచించి, సత్ క్రియలయందాసక్తిగల ప్రజలను తనకోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను.

# క్రీస్తు రక్తము వలన పాప పరిహారము

ఎఫెసీయులకు 1:7

దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది.

1 యోహాను 1:7

అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతిపాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును.

హెబ్రీయులకు 9:14

నిత్యుడగు ఆత్మ ద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధి చేయును.

# క్రీస్తునందలి విశ్వాసము ద్వారా రక్షణ

1 యోహాను 5:4

దేవుని మూలముగా పుట్టిన వారందరును లోకమును జయించుదురు; లోకమును జయించిన విజయము మన విశ్వాసమే.

ఎఫెసీయులకు 2:8–9

మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు. దేవుని వరమే. అది క్రియల వలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు.

యోహాను 6:28–29

వారు – మేము దేవుని క్రియలు జరిగించుటకు ఏమి చేయవలెనని ఆయనను అడుగగా యేసు – ఆయన పంపిన వానియందు మీరు విశ్వాసముంచుటయే దేవుని క్రియయని వారితో చెప్పెను.

# దేవుని కృప

తీతుకు 3:5

మనము నీతిని అనుసరించి చేసిన క్రియలమూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను.

కీర్తనలు 103:11

భూమికంటె ఆకాశము ఎంత ఉన్నతముగా ఉన్నదో ఆయనయందు భయభక్తులు గలవారి యెడల ఆయన కృప అంత అధికముగా ఉన్నది.

కీర్తనలు 103:17,18

ఆయన నిబంధనను గైకొనుచు ఆయన కట్టడల ననుసరించి నడచుకొను వారిమీద యెహోవాయందు భయభక్తులు గలవారిమీద ఆయన కృప యుగయుగములు నిలుచును ఆయన నీతి వారికి పిల్లపిల్లతరమున నిలుచును.

# దేవుడు తన యొద్దకు రమ్మని పిలుచుచున్నాడు 

ప్రకటన 22:17

ఆత్మయు పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు; వినువాడును రమ్ము అని చెప్పవలెను; దప్పిగొనిన వానిని రానిమ్ము; ఇచ్ఛయించువానిని జీవజలమును, ఉచితముగా పుచ్చుకొననిమ్ము.

మత్తయి 11:28

ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును.

యెషయా 1:18

యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు – రండి మన వివాదము తీర్చుకొందము. మీ పాపములు రక్తమువలె ఎర్రనివైనను అవి హిమమువలె తెల్లబడును. కెంపువలె ఎర్రనివైనను అవి గొర్రె బొచ్చువలె తెల్లనివగును.

# సర్వజనులు దేవుని పిల్లలు కానేరరు

1 యోహాను 3:10

దీనినిబట్టి దేవుని పిల్లలెవరో అపవాది పిల్లలెవరో తేటపడును. నీతిని జరిగించని ప్రతివాడును, తన సహోదరుని ప్రేమింపని ప్రతివాడును దేవుని సంబంధులు కారు.

యోహాను 1:12

తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను.

రోమా 8:14,15

దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు. ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదుగాని దత్తపుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము అబ్బా తండ్రీ అని మొర్ర పెట్టుచున్నాము.

# సురపానీయములను గూర్చి దేవుడేమని చెప్పుచున్నాడు 

యెషయా 5:11

మద్యము త్రాగుదమని వేకువనే లేచి ద్రాక్షారసము తమకు మంట పుట్టించు వరకు చాల రాత్రి వరకు పానము చేయువారికి శ్రమ.

గలతీయులకు 5:19,21

శరీరకార్యములు స్పష్టమైయున్నవి; అవేవనగా, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి. వీటినిగూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను.

# కేవలము నిష్కాపట్యము చాలదు

మార్కు 10:17-22

ఆయన బయలుదేరి మార్గమున పోవుచుండగా ఒకడు పరుగెత్తికొని వచ్చి ఆయన యెదుట మోకాళ్లూని - సద్బోధకుడా, నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయుదునని ఆయన నడిగెను. యేసు - నన్ను సత్పురుషుడని యేల చెప్పుచున్నావు? దేవుడొక్కడే గాని మరి ఎవడును సత్పురుషుడు కాడు. నరహత్య చేయవద్దు, వ్యభిచరింపవద్దు, దొంగిలవద్దు, అబద్ధసాక్ష్యము పలుకవద్దు, మోసపుచ్చ వద్దు, నీ తల్లిదండ్రులను సన్మానింపుము అను ఆజ్ఞలు నీకు తెలియును గదా అని అతనితో చెప్పెను. అందుకతడు - బోధకుడా, బాల్యము నుండి ఇవన్నియు అనుసరించుచునే యుంటినని చెప్పెను. యేసు అతని చూచి అతని ప్రేమించి - నీకు ఒకటి కొదువగానున్నది, నీవు వెళ్లి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము, పరలోకమందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని చెప్పెను. అతడు మిగుల ఆస్తిగలవాడు, గనుక ఆ మాటకు ముఖము చిన్నబుచ్చుకొని, దుఃఖపడుచు వెళ్లిపోయెను.

# మోసపోకుడి



1 కొరింథీయులకు 6:9,10

అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి, జారులైనను, విగ్రహారాధకులైనను, వ్యభిచారులైనను, ఆడంగితనముగలవారైనను, పురుష సంయోగులైనను, దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు.

ఎఫెసీయులకు 5:6

వ్యర్థమైన మాటలవలన ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి; ఇట్టి క్రియలవలన దేవుని ఉగ్రత అవిధేయులైన వారిమీదికి వచ్చును గనుక మీరు అట్టివారితో పాలివారై యుండకుడి.

# పాపము మరణమును తెచ్చును

యాకోబు 1:15

దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును.

రోమా 5:12

ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపముద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను.

లూకా 15:32

మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే; ఈ నీ తమ్ముడు చనిపోయి తిరిగి బ్రదికెను, తప్పిపోయి దొరకెనని అతనితో చెప్పెను.

# క్రీస్తు మరణమును జయించెను

ప్రకటన 1:18

నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను; మృతుడనైతిని గాని ఇదిగో యుగయుగములు సజీవుడనైయున్నాను. మరియు మరణముయొక్కయు పాతాళ లోకము యొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో ఉన్నవి.

లూకా 7:14,15

ప్రభువు దగ్గరకు వచ్చి పాడెను ముట్టగా మోయుచున్నవారు నిలిచిరి. ఆయన – చిన్నవాడా లెమ్మని నీతో చెప్పుచున్నాననగా ఆ చనిపోయినవాడు లేచి కూర్చుండి మాటలాడసాగెను.

యోహాను 11:43,44

ఆయన ఆలాగు చెప్పి – లాజరూ, బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా చనిపోయిన వాడు, కాళ్లు చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి వచ్చెను; అతని ముఖమునకు రుమాలు కట్టి యుండెను. అంతట యేసు – మీరు అతని కట్లు విప్పిపోనియ్యుడని వారితో చెప్పెను.

# దేవుని ఆజ్ఞలు

ద్వితీయోపదేశకాండము 5:7-21

నేను తప్ప వేరొక దేవుడు నీకుండకూడదు.

పైనున్న ఆకాశమందే గాని, క్రిందనున్న భూమియందే గాని భూమి క్రిందనున్న నీళ్లయందేగాని యుండు దేని పోలికనైన విగ్రహమును చేసికొనకూడదు. వాటికి నమస్కరింపకూడదు; వాటిని పూజింపకూడదు. నీ దేవుడనైన యెహోవాయగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరములవరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు నన్ను ప్రేమించి నా ఆజ్ఞలను గైకొనువారి విషయములో వేయి తరములవరకు కరుణించువాడనై యున్నాను.

నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా ఉచ్చరింపకూడదు; యెహోవా తన నామమును వ్యర్థముగా ఉచ్చరించు వానిని నిర్దోషిగా ఎంచడు.

నీ దేవుడైన యెహోవా నీ కాజ్ఞాపించినట్లు విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. ఏడవ

దినమున నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను నీ దాసియైనను నీ యెద్దయినను నీ గాడిదయైనను నీ పశువులలో ఏదైనను నీ యిండ్లలోనున్న పరదేశియైనను ఏ పనియు చేయకూడదు. ....నీవు ఐగుప్తుదేశమందు దాసుడవైయున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలము చేతను చాచిన చేతి చేతను నిన్ను అక్కడనుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను.

నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవై నీకు క్షేమమగునట్లు నీ దేవుడైన యెహోవా నీ కాజ్ఞాపించినలాగున నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము.

నరహత్య చేయకూడదు; వ్యభిచరింపకూడదు; దొంగిలకూడదు.

నీ పొరుగు వానిమీద అబద్ధ సాక్ష్యము పలుక కూడదు.

నీ పొరుగువాని భార్యను ఆశింపకూడదు. నీ పొరుగు వాని యింటినైనను వాని పొలమునైనను వాని దాసునినైనను వాని దాసినినైనను వాని యెద్దునైనను వాని గాడిదనైనను నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు.

# దేవునికి కనబడకుండ నీవు దాగలేవు

లూకా 8:17

తేటపరచబడని రహస్యమేదియులేదు; తెలియజేయబడకయు బయలుపడకయు నుండు మరుగైనదేదియు లేదు.

సామెతలు 15:3

యెహోవా కన్నులు ప్రతి స్థలము మీద నుండును. చెడ్డవారిని మంచివారిని ఆయన చూచుచుండును.

యోబు 34:21,22

ఆయన దృష్టి నరుల మార్గముల మీద నుంచబడియున్నది. ఆయన వారి నడకలన్నియు కనిపెట్టి చూచుచున్నాడు. దుష్క్రియలు చేయువారు దాగుకొనుటకు చీకటియైనను మరణాంధకారమైనను లేదు.

# దైవభక్తిలేని వారికి నిత్యశిక్ష



మత్తయి 25:46

వీరు నిత్యశిక్షకును, నీతిమంతులు
నిత్యజీవమునకును పోవుదురు.

మత్తయి 13:41,42

మనుష్య కుమారుడు తన దూతలను పంపును; వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైనవాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును.

కీర్తనలు 9:17

దుష్టులును దేవుని మరుచు జనులందరును పాతాళమునకు దిగిపోవుదురు.

# తీర్పు జరుగును

అపొస్తలుల కార్యములు 17:31

ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసియున్నాడు.

రోమా 14:12

ప్రతి నాలుకయు దేవుని స్తుతించును అని ప్రభువు చెప్పుచున్నాడు అని వ్రాయబడి యున్నది గనుక మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను.

1 యోహాను 4:17

తీర్పు దినమందు మనకు ధైర్యము కలుగునట్లు దీనివలన ప్రేమ మనలో పరిపూర్ణము చేయబడి యున్నది; ఏలయనగా ఆయన ఎట్టివాడై యున్నాడో మనము కూడ ఈ లోకములో అట్టివారమై యున్నాము.

# యేసుక్రీస్తు కృప

రోమా 9:16

కాగా పొందగోరువానివలననైనను, ప్రయాసపడువాని వలననైనను కాదు గాని, కరుణించు దేవుని వలననే అగును.

2 కొరింథీయులకు 9:15

చెప్పశక్యము కాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము.

1 పేతురు 5:5

దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును.

2 కొరింథీయులకు 8:9

మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడై యుండియు, మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను.

# పశ్చాత్తాపము

లూకా 13:3

మీరు మారు మనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు.

2 కొరింథీయులకు 7:10

దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును. ఈ మారుమనస్సు దుఃఖమును పుట్టించదు. అయతే లోక సంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును.

అపొస్తలుల కార్యములు 3:19

ప్రభువు సముఖము నుండి విశ్రాంతికాలములు వచ్చునట్లును, మీ కొరకు నియమించిన క్రీస్తుయేసును ఆయన పంపునట్లును మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారు మనస్సు నొంది తిరుగుడి.

# పాప క్షమాపణ

మత్తయి 6:14

మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల; మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును.

యెషయా 55:7

భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను. వారు యెహోవా వైపు తిరిగిన యెడల ఆయన వారి యందు జాలిపడును. వారు మన దేవుని వైపు తిరిగిన యెడల ఆయన బహుగా క్షమించును.

ప్రకటన 3:20

ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము.

# లోకము నుండి వేరగుట

కొలొస్సయులకు 3:2

పైనున్న వాటిమీదనే గాని, భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టుకొనకుడి.

ఎఫెసీయులకు 5:11

నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారైయుండక వాటిని ఖండించుడి.

1 యోహాను 2:15,16

ఈ లోకమునైనను లోకములో ఉన్న వాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు, జీవపు డంబమును తండ్రి వలన పుట్టినవి కావు; అవి లోక సంబంధమైనవే.

# నూతన జన్మము



1 పేతురు 1:23

మీరు క్షయబీజము నుండి కాక, శాశ్వతమగు జీవము గల దేవుని వాక్యమూలముగా అక్షయబీజమునుండి పుట్టింపబడినవారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు, మీరు సత్యమునకు విధేయులవుట చేత మీ మనస్సులను పవిత్ర పరుచుకొనిన వారై యుండి, యొకని నొకడు హృదయ పూర్వకముగాను మిక్కుటముగాను ప్రేమించుడి.

1 యోహాను 5:18

దేవుని మూలముగా పుట్టియున్న వాడెవడును పాపము చేయడని యెరుగుదుము. దేవుని మూలముగా పుట్టినవాడు తన్ను భద్రము చేసికొనును గనుక దుష్టుడు వాని ముట్టడు.

యోహాను 3:3

అందుకు యేసు అతనితో – ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను.

# పాపమునకు మరణించి - క్రీస్తు నందు లేచుట

గలతీయులకు 5:24

క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువ వేసి యున్నారు.

రోమా 6:2,11

పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించుదుము..... అటువలె మీరును పాపము విషయమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసు నందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి.

కొలొస్సయులకు 3:1

మీరు క్రీస్తుతో కూడ లేపబడినవారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండియున్నాడు.

# నిత్య జీవము

యోహాను 17:3

అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్య జీవము.

రోమా 6:23

ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన యేసుక్రీస్తునందు నిత్య జీవము.

యోహాను 5:24

నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచువాడు నిత్య జీవము గలవాడు. వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటి యున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

# రక్షణ నిశ్చయత

1 యోహాను 4:13

దీని వలన మనము ఆయన యందు నిలిచియున్నామనియు ఆయన మనయందున్నాడనియు తెలిసికొనుచున్నాము; ఏలయనగా ఆయన మనకు తన ఆత్మలో పాలు దయచేసి యున్నాడు.

యెషయా 32:17

నీతి సమాధానము కలుగజేయును, నీతివలన నిత్యమును నిమ్మళము నిబ్బరము కలుగును.

యోహాను 14:21

నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు; నన్ను ప్రేమించువాడు నా తండ్రి వలన ప్రేమింపబడును; నేనును వానిని ప్రేమించి; వానికి నన్ను కనబరచుకొందునని చెప్పెను.

# నీలో - నివసించుచున్న క్రీస్తు సంతోషమిచ్చును



కీర్తనలు 16:11

జీవమార్గమును నీవు నాకు తెలియచేసెదవు. నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు నీ కుడిచేతిలో నిత్యము సుఖములు కలవు.

యోహాను 15:11

మీయందు నా సంతోషము ఉండవలెననియు, మీ సంతోషము పరిపూర్ణము కావలెననియు, ఈ సంగతులు మీతో చెప్పుచున్నాను.

గలతీయులకు 2:20

నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నే నిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసము వలన జీవించుచున్నాను.

# ప్రభువునకు విధేయుడవై యుండుట అవసరము

రోమా 6:16

లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో, అది చావు నిమిత్తముగా పాపమునకే గాని, నీతి నిమిత్తముగా విధేయతకే గాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీ రెరుగరా?

ద్వితీయోపదేశ కాండము 11:26-28

చూడుడి; నేడు నేను మీ యెదుట దీవెనను శాపమును పెట్టుచున్నాను. నేడు నేను మీకాజ్ఞాపించు మీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను మీరు వినిన యెడల దీవెనయు, మీరు మీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను వినక నేడు నేను మీ కాజ్ఞాపించు మార్గమును విడిచి మీరెరుగని యితర దేవతలను అనుసరించిన యెడల శాపమును మీకు కలుగును.

# క్రీస్తును ఒప్పుకొనుట అవసరము

మత్తయి 10:32,33

మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగనననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును.

రోమా 10:9,10

అదేమనగా – యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును.

# సాతాను మన ప్రథమ శత్రువు



1 పేతురు 5:8

నిబ్బరమైన బుద్ధిగలవారై మెళకువగా ఉండుడి;
మీ విరోధియైన అపవాది గర్జించు
సింహము వలె ఎవరిని
మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు.

మత్తయి 4:1,10,11

అప్పుడు యేసు అపవాది చేత శోధింపబడుటకు ఆత్మవలన అరణ్యమునకు కొనిపోబడెను...... యేసు వానితో – సాతానా, పొమ్ము – ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడియున్నదనెను. అంతట అపవాది ఆయనను విడిచిపోగా, ఇదిగో దేవదూతలు వచ్చి ఆయనకు పరిచర్య చేసిరి.

# సాతానుపై జయము

2 థెస్సలొనీకయులకు 2:8

అప్పుడా ధర్మ విరోధి బయలుపరచబడును. ప్రభువైన యేసు తన నోటి యూపిరి చేత వానిని సంహరించి తన ఆగమన ప్రకాశము చేత నాశనము చేయును.

యాకోబు 4:7,8

కాబట్టి దేవునికి లోబడియుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవును. దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును.

1 యోహాను 3:8

అపవాది మొదట నుండి పాపము చేయుచున్నాడు గనుక పాపము చేయువాడు అపవాది సంబంధి; అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను.

# ప్రేమ శిష్యత్వమునకు పరీక్ష

యోహాను 13,35

మీరు ఒకని యెడల ఒకడు ప్రేమ గలవారైన యెడల దీని బట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురనెను.

1 యోహాను 4:20

ఎవడైనను - నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు.

గలతీయులకు 5:22,23

అయితే **ఆత్మ** ఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము. ఇట్టివాటికి విరోధమైన నియమ మేదియు లేదు.

# క్రీస్తు పునరుత్థానము

రోమా 4:25

ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగింపబడి, మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను.

యోహాను 20:26–28

ఎనిమిది దినములైన తరువాత ఆయన శిష్యులు మరల లోపల ఉన్నప్పుడు తోమా వారితో కూడ ఉండెను. తలుపులు మూయబడియుండగా యేసు వచ్చి మధ్యను నిలిచి – మీకు సమాధానము కలుగును గాక అనెను. తరువాత తోమాను చూచి – నీ వ్రేలు ఇటుచాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో వుంచి, అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమనెను. అందుకు తోమా ఆయనతో – నా ప్రభువా, నా దేవా అనెను.

# పునరుత్థానము, మన మహిమ గల నిరీక్షణ

రోమా 6:3-5

క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన, క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము.

యోహాను 5:25

మృతులు దేవుని కుమారుని శబ్దము విను గడియవచ్చుచున్నది, ఇప్పుడే వచ్చి యున్నది, దానిని వినువారు జీవింతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను..........

# ప్రభువు పరిశుద్ధత



## 1 పేతురు 1:16

మిమ్మును పిలిచిన వాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తన యందు పరిశుద్ధులై యుండుడి.

## మత్తయి 3:11

మారు మనస్సు నిమిత్తము నేను నీళ్లలో మీకు బాప్తిస్మమిచ్చుచున్నాను; అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నాకంటె శక్తిమంతుడు; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను; ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మ మిచ్చును.

## లూకా 1:75

మనము శత్రువుల చేతి నుండి విడిపింపబడి, మన జీవిత కాలమంతయు నిర్భయులమై, ఆయన సన్నిధిని పరిశుద్ధముగాను నీతిగాను ఆయనను సేవింపను, అనుగ్రహించుటకును ఈ రక్షణ కలుగజేసెను.

# ఆత్మపూర్ణులైన మనుష్యులు

అపొస్తలుల కార్యములు 1:8

అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక.......మీరు భూదిగంతముల వరకును, నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను.

అపొస్తలుల కార్యములు 4:31

వారు ప్రార్థన చేయగానే వారు కూడియున్న చోటు కంపించెను; అప్పుడు వారందరు పరిశుద్ధాత్మతో నిండినవారై దేవుని వాక్యమును ధైర్యముగా బోధించిరి.

రోమా 8:9

దేవుని **ఆత్మ** మీలో నివసించియున్న యెడల మీరు ఆత్మ స్వభావము గలవారే గాని శరీర స్వభావము గలవారు కారు. ఎవడైనను క్రీస్తు ఆత్మలేని వాడైతే వాడాయన వాడు కాడు.

# క్రైస్తవులకు ఆశ్చర్యమైన వాగ్దానములు



## 1 పేతురు 4:12,13

ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహా శ్రమను గూర్చి మీకేదో యొక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి. క్రీస్తు మహిమ బయలుపరచబడినప్పుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము, క్రీస్తు శ్రమలలో మీరు పాలివారైయున్నంతగా సంతోషించుడి.

## యెషయా 66:2

అవన్నియు నా హస్తకృత్యములు అవి నావలన కలిగినవని యెహోవా సెలవిచ్చుచున్నాడు. ఎవడు దీనుడై నలిగిన హృదయముగలవాడై నామాట విని వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నాను.

# శోధింపబడు వారికి వాగ్దానములు

కీర్తనలు 34:19

నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు వాటి అన్నిటిలో నుండి యెహోవా వానిని విడిపించును.

రోమా 16:20

సమాధాన కర్తయగు దేవుడు సాతానును మీ కాళ్ల క్రింద శీఘ్రముగా చితుక త్రొక్కించును.

1 కొరింథీయులకు 10:13

సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగినంత కంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును.

# శోధనలు జయించిన వారికి వాగ్దానములు

ప్రకటన 21:7

జయించువాడు వీటిని స్వతంత్రించుకొనును; నేనతనికి దేవుడనై యుందును. అతడు నాకు కుమారుడై యుండును.

ప్రకటన 3:21

నేను జయించి నా తండ్రితో కూడ ఆయన సింహాసనమునందు కూర్చుండియున్న ప్రకారము జయించువానిని నాతోకూడ నా సింహాసనమునందు కూర్చుండ నిచ్చెదను.

ప్రకటన 3:5

జయించువాడు ఆలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును; జీవగ్రంథములో నుండి అతని పేరంతమాత్రమును తుడుపు పెట్టక, నా తండ్రి యెదుటను ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పుకొందును.

# భార్య-భర్తల విడాకుల గూర్చి దేవుడు మాట్లాడుచున్నాడు

లూకా 16:18

తన భార్యను విడనాడి, మరియొకతెను వివాహము చేసుకొను ప్రతివాడు వ్యభిచరించుచున్నాడు. భర్తను విడిచిన దానిని వివాహము చేసికొనువాడు వ్యభిచరించుచున్నాడు.

మత్తయి 5:32

నేను మీతో చెప్పునదేమనగా - వ్యభిచార కారణమును బట్టి గాక, తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు; విడనాడబడిన దానిని పెండ్లాడువాడు వ్యభిచరించుచున్నాడు.

# యేసుక్రీస్తు తిరిగి రానైయున్నాడు

## యోహాను 14:3

నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నే నుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసుకొని పోవుదును.

## మత్తయి 24:30

అప్పుడు మనుష్యకుమారుని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశమేఘారూడుడై వచ్చుట చూచి, భూమి మీద నున్న సకల గోత్రములవారు రొమ్ము కొట్టుకొందురు.

## మార్కు 8:38

వ్యభిచారమును పాపమును చేయు ఈ తరము వారిలో నన్ను గూర్చియు నా మాటలను గూర్చియు సిగ్గుపడువాడెవడో, వానిని గూర్చి మనుష్య కుమారుడు తన తండ్రి మహిమ గలవాడై పరిశుద్ధ దూతలతో కూడ వచ్చునప్పుడు సిగ్గుపడునని చెప్పెను.

## లూకా 12:40

మీరు అనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును గనుక మీరును సిద్ధముగా ఉండుడని చెప్పెను.

## మత్తయి 16:27

మనుష్య కుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడా రాబోవుచున్నాడు. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును.

# దేవుని వాక్యము

ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలేమాత్రమును గతింపవు. లూకా 21:33



దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు, దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది. 2వ తిమోతి 3:16

నీ వాక్యము నా పాదములకు దీపమును నాత్రోవకు వెలుగునై యున్నది. కీర్త 119:105

## ప్రార్థన మరియు క్షమాపణ

కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి, - పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడును గాక, నీ రాజ్యము వచ్చుగాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక, మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము. మమ్మును శోధనలోకి తేక దుష్టుని నుండి మమ్మును తప్పించుము. మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు. మత్తయి 6:9-15.

# దేవుని రక్షణ మార్గము

**నాకు రక్షకుడు అవసరం –** ఏ భేధమును లేదు; అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. (రోమా 3:23) మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు. (యెషయా 59:2)

**క్రీస్తు నా కొరకు మరణించెను –** అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయములో చంపబడియు, ఆత్మ విషయములో బ్రదికింపబడి, పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను. (1పేతురు 3:18) నా పాపముల నిమిత్తం పశ్చాత్తాప పడాలి – అతిక్రమములను దాచి పెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును. (సామె 28:13.) మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారు మనస్సు నొంది తిరుగుడి. (అపొస్తలుల కార్యములు 3:20).

**విశ్వాసము ద్వారా తప్పక క్రీస్తును స్వీకరించాలి –** తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. (యోహాను 1:12) దేవుని కుమారుని అంగీకరించువాడుజీవము గలవాడు. (1యోహాను 5:12)

**నా రక్షణ విషయంలో నిశ్చయత కల్గియున్నాను –** నా మాట విని నన్ను పంపినవాని యందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవము లోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. (యోహాను 5:24).

వాట్ సన్ గుడ్ మన్ చే కూర్చబడినది

Read booklets online or by App
www.wmp-readonline.org

www.wmpress.org

5-21

81 Telugu HFA